విద్యార్థినులు ఆర్థిక నైపుణ్యం పెంచుకోవాలి

ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశ్రావ్య


మాట్లాడుతున్న ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశ్రావ్య

కీసర: ఆర్థిక విద్యారంగంలో విద్యార్థినులు రాణించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీశ్రావ్య అన్నారు. కీసరలోని ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతతో పాటు విద్యా, ఉద్యోగ నైపుణ్యాలపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఆర్థిక విద్యారంగంలో విద్యార్థులు రాణించి, సైబర్ నేరాలకు గురికాకుండా ప్రతి ఒక్కరినీ చైతన్యవంతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. ఆర్థిక నైపుణ్యత సాధించడంలో అతివలు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ వనజాత, వైస్ ప్రిన్సిపాల్ గంగావతి, ఎస్ఎస్‌టీసీఎఫ్ఎల్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కో ఆర్డినేటర్ ఎల్లబోయిన విశ్వనాథ్, కౌన్సిలర్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారి హత్య కేసులో నిందితుడి అరెస్ట్


హప్నా హెమ్ బ్రామ్

పోచారం: ఆరేళ్ల చిన్నారి హత్య కేసులో నిందితుడిని పోచారం పోలీసులు మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టారు. ఇటీవల ఆరేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటనలో ప్రధాన నిందితుడైన హప్నా హెమ్‌బ్రామ్(35) పోచారంలోని సెరీన్ హిల్స్ కౌంటీ సమీపంలోని విశ్వకర్మ లేబర్ క్యాంపులో ఉంటున్నాడు. ఇతడి స్వగ్రామం పశ్చిమ బెంగాల్‌లోని పర్బాతిపూర్‌గా పోలీసులు గుర్తించారు. పోలీసులు ఇతడిని అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టారు.

యువకుడి ఆత్మహత్య


కల్యాణ్‌రెడ్డి(ఫైల్)

కీసర: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాలలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. చీర్యాలకు చెందిన రామిడి కృష్ణారెడ్డికి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కొడుకు కల్యాణ్‌రెడ్డి(27) బీటెక్ చదివి ఏపీ టూరిజంలో మార్కెటింగ్ విభాగంలో పని చేశాడు. ఇటీవల ఏఎస్‌రావునగర్‌లో కన్సల్టెన్సీ ఆఫీస్ పెట్టాడు. మంగళవారం తల్లి బంధువులతో కలిసి బల్కంపేట్ గుడికి వెళ్లగా, తండ్రి ఉద్యోగానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్యాణ్‌రెడ్డి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఫ్యాన్‌కు వేలాడుతున్న కొడుకును చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు సూసైడ్ నోట్ లభించింది. తన చావుకు ఎవరూ బాధ్యులు కారని రాసి ఉంది. కేసును కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

సుభాష్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమీపంలో చింతల్ హెచ్ఎంటీ కాలనీకి చెందిన డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న సూరారం పోలీసులు ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు అక్కడకు చేరుకోగా.. నిందితుడు పారిపోవడానికి యత్నించాడు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు అతడిని పట్టుకుని 260 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

సుభాష్‌నగర్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం కృషి కాలనీకి చెందిన జనార్దన్(48), విజయ భార్యాభర్తలు. కూలి పనులు చేసే జనార్దన్ సోమవారం ఉదయం 9:40 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని మొబైల్‌కు ప్రయత్నించగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. మంగళవారం అతని భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు అధికారుల చేతుల్లో ‘పుర సేవలు’

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల పరిశీలన బాధ్యత అప్పగింత

- ఇక నుంచి ఏ పనికైనా వారి బాధ్యత కీలకం
- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర పురపాలక శాఖ
- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు



సాక్షి, సిటీబ్యూరో: పురపాలిక సంఘాల్లోని వార్డు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. జనన, మరణ ధ్రువపత్రాల పరిశీలన బాధ్యతలను వారికి అప్పగిస్తూ ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలికల్లో ఏ పనుల్లోనూ వార్డు అధికారుల ప్రమేయం అంతగా ఉండటం లేదు. ఇక నుంచి ఏ పని చేసినా వారి పాత్ర కీలకం కానుంది.

ధ్రువపత్రాల జారీలో..

పురపాలక సంఘాల నుంచి ధ్రువ పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన దుస్థితి నెలకొంటోంది. సాధారణంగానే పట్టణాల్లో ఇటీవల జనన, మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. దీనికి తోడు పురపాలికల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన నేపథ్యంలో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉండగా, ఇటీవల అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న 40 గ్రామ పంచాయతీలు సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనమయ్యాయి. ఒక్క మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల పరిధిలో 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. బర్త్, డెత్, మ్యారేజ్ సర్టిఫికెట్లు(ధ్రువీకరణ పత్రాలు)తో సహా ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లు, మ్యూటేషన్లు నల్లా అనుమతులు పొందడానికి కూడా స్థానిక ప్రజలు పాట్లు పడాల్సి వస్తోంది.

మిగతా వాటిల్లోనూ అంతే..

పురపాలక సంఘాల్లో చెత్తా చెదారం, డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలు కూడా ప్రజలను వెక్కిరిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పెరిగిన చెట్ల పొదలు, పేరుకుపోతున్న చెత్తా చెదారంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పన్నుల వసూళ్లతో సహా వాణిజ్య వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థలకు సంబంధించి పన్ను మదింపు(ఖరారు)లోనూ ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మాణాల అనుమతుల విషయంలోనూ తీవ్ర జాప్యమే కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతో ఈ వ్యవహారంపై రాష్ట్ర పురపాలక శాఖకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే పత్రాలు జారీ చేయడం ఏమిటని రాష్ట్ర పురపాలకశాఖ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత బాధ్యతలను వార్డు అధికారులకు అప్పగిస్తూ పరిశీలన చేపట్టి తప్పులు లేకుండా పత్రాలు జారీ చేయాలని సూచిస్తోంది. పట్టణాల్లో నేరుగా మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని ధ్రువపత్రాన్ని తీసుకుంటున్నారు. పురపాలికల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన పెరగాలన్న ఉద్దేశంతో వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇక నుంచి వెంటనే జనన, మరణ ధ్రువపత్రాలు అందనున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగిస్తామని పురపాలక సంఘాల కమిషనర్లు పేర్కొంటున్నారు.

దమ్మాయిగూడలో తైబజార్ వేలం


దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో కొనసాగుతున్న తైబజార్

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో 2025–2026 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం నిర్వహించిన తైబజార్ వేలం పాటలో మంగల్‌పురి కిరణ్ రూ.31.06 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. అతడికి ఏడాది కాలం పాటు మున్సిపల్ పరిధిలో నిర్వహించే వారాంతపు సంతలో తైబజార్ వసూలు చేసుకునేందుకు మున్సిపల్ నుంచి అవకాశం కల్పించడం జరుగుతుంది. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేషం, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో..

నాగారం మున్సిపాలిటీలో 2025–2026 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తైబజార్ వేలం పాట నిర్వహించగా ముగ్గురు పాల్గొన్నారు. ఎస్.కృష్ణారావు రూ.28.9 లక్షలకు తైబజార్ వేలం పాట పాడారు. కాగా మున్సిపాలిటీ నిర్ణయించిన ధరకంటే తక్కువ వచ్చినందున ఉన్నతాధికారులకు నివేదిక పంపి మళ్లీ వేలంపాట నిర్వహిస్తామని, తేదీ ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు.

రైల్వే వంతెన పనులకు నిధుల కోసం వినతి


ఉపముఖ్యమంత్రి భట్టికి వినతి పత్రం అందజేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి 14 ఏళ్లుగా వంతెన పనుల కోసం స్థానికులు, ప్రయాణికులు ఎదురు చూస్తున్నారని, నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించాలని లేఖలో కోరారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి రూ.50 లక్షలు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

జవహర్ నవోదయకు 29 మంది క్రాంతికీన్ విద్యార్థులు


విద్యార్థులతో అకాడమి ప్రిన్సిపల్ కల్యాణి

కీసర: ఈ ఏడాది జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ) 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని క్రాంతి కీన్ అకాడమీ నుంచి 29 మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని క్రాంతి కీన్ అకాడమీ ప్రిన్సిపల్ కళ్యాణి అన్నారు. జేఎన్‌వీ పాఠశాలలు భారత ప్రభుత్వానికి చెందిన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్‌ఆర్‌డీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశం తీసుకొని 12వ తరగతి వరకు విద్య, వసతి, భోజనం, పుస్తకాలు అన్నీ ఉచితం అన్నారు. ఇది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అరుదైన అవకాశం అని తెలిపారు. సెక్రటరీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులపై నిరసన



మేడ్చల్: చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన ఆశ వర్కర్లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు మేడ్చల్ బస్సు ప్రయాణ ప్రాంగణం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి విఘాతం కల్పించేందుకు ఆశ వర్కర్లను ముందస్తు అరెస్ట్ చేయడం, మహిళలు అని చూడకుండా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఆశ వర్కర్లు వసంత, రాజకుమారి, రాజమణి, యాదమ్మ, సునంద, మమత, పద్మ, రజిత, లావణ్య, రాణి, అరుణ, ఫయామ్, అనిత, కల్పన, నాయకులు నరేశ్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

దుండిగల్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డి.పోచంపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలోని 3, 5, 8 బ్లాక్‌ల వద్ద ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశాలతో మూడు బోర్లను కలెక్టర్ నుంచి మంజూరు చేయించామని తెలిపారు. వెంటనే వర్క్ ఆర్డర్ ఇచ్చి బోర్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గణేష్, నాగమణి, మధు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం

కుత్బుల్లాపూర్: నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇటీవల అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఒరిగంటి వెంకటరమరాజుకు రూ.60 వేలు, జి.లక్ష్మమ్మకు రూ. 35 వేల చెక్కులను షాపూర్ నగర్‌లోని తన నివాసంలో మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజా పాలనలో ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిషిజపై ఆరోపణలు అవాస్తవం

- న్యాయస్థానం ద్వారా ఎదుర్కొంటాం
- న్యాయస్థానం నిషిజ డెవలపర్ యజమాని పర్వతానేని గంగాధర్‌రావు


మాట్లాడుతున్న నిషిజ డెవలపర్ యజమాని గంగాధర్‌రావు

ఘట్‌కేసర్: ప్రభుత్వ భూమిని నిషిజ డెవలపర్స్ కబ్జా చేశారనేది అవాస్తవమని నిషిజ డెవలపర్స్ యజమాని పర్వతానేని గంగాధర్‌రావు అన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నిషిజ డెవలపర్స్ పేరుతో సర్వే నంబర్ 543/3, 543/4, 543/5, 543/6, 543/7, 543/8, 543/9లోని 133 ఎకరాల్లో వెంచర్ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హెచ్ఎండీఏ, రెరా అనుమతులతో పాటు మైనింగ్, బ్లాస్టింగ్ అనుమతులు కలిగి ఉన్నామన్నారు. వెంచర్‌కు పడమర దిక్కున సర్వే నంబర్ 543/2లో గల 18 ఎకరాల ప్రభుత్వ భూమికి కలెక్టర్ ఆదేశం మేరకు స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో సరిహద్దులు ఏర్పాటు చేయగా నిషిజ యాజమాన్యం ప్రహరీ నిర్మించిందన్నారు. ఆలయం భూమి, ప్రభుత్వ భూమి కబ్జా చేశామనేది అవాస్తవం అన్నారు. నిషిజ యాజమాన్యంపై తప్పుడు ఆరోపణలు చేసి సంస్థకు పరువు, ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే సహించేది లేదని, అలాంటి వారిని న్యాయస్థానం ద్వారా ఎదుర్కొంటామన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోనున్న మూడుచింతలపల్లి


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలాన్ని నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం శుభపరిణామమని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ అన్నారు. మండల కేంద్రం మూడుచింతలపల్లి ప్రధాన చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం మంగళవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి చేరువలో ఉన్న మూడుచింతలపల్లి మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో అభివృద్ధిలో దూసుకుపోతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల వైస్ ఎంపీపీ మంద శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాథం, బాలనరసింహ, బసవారెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సఖీ ద్వారా మహిళలకు ఉచిత సేవలు


కార్యక్రమంలో మహిళలు

సుభాష్‌నగర్: సూరారం వెంకటరమణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సఖీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు, వరకట్నం వేధింపులు, ఇతర సమస్యలపై అవగాహన కల్పిస్తూ బాధితులు ఎవరైనా ఉంటే 181 హెల్ప్‌లైన్ నెంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. సఖీలో బాధిత మహిళలకు న్యాయ సహాయం, మెడికల్ అండ్ షెల్టర్, కౌన్సిలింగ్ వంటి సేవలు ఉచితంగా లభిస్తాయన్నారు. సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముంజుల, ఏడబ్ల్యూబ్ల్యూ కార్యకర్త శోభ, లావణ్య, పారామెడికల్ అక్షయ, ఉపాధ్యాయులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కొండపోచమ్మ సాగర్ డ్యామ్ నుంచి నీరు విడుదల


నారాయణపూర్ వద్ద నీటిని విడుదల చేస్తున్న అధికారులు, రైతులు

శామీర్‌పేట్: కొండపోచమ్మ సాగర్ డ్యామ్ కాల్వ ద్వారా మూడుచింతలపల్లి మండలంలోని పలు గ్రామాలకు సాగునీటిని అధికారులు మంగళవారం విడుదల చేశారు. మూడుచింతలపల్లి మండలంలోని గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి పోయాయని, తద్వారా చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహలుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన కొండ పోచమ్మ డ్యామ్ అధికారులతో చర్చించారు. మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ముందుగా నారాయణపూర్ గ్రామంలోని కాలువ వద్ద రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పోచారం: పోచారంలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోచారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్–35లో కొనసాగుతున్న నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుతో కూల్చివేతలు కొనసాగాయి. ఆర్ఐ సాయిరాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పరిశ్రమలో సాంకేతికత ఎంతో అవసరం


సదస్సులో సైంటిస్ట్, యూనివర్సిటీ వీసీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఫుడ్ సైన్స్‌లో న్యూ హారిజన్స్‌పై జాతీయ సదస్సు నిర్వహించారు. స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఫాస్టరింగ్ అకాడెమియా– ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్‌పై రెండు రోజుల పాటు సాగిన సదస్సులో మొదటి రోజు సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ విజయేంద్రరావు, మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, డీన్ రాజారెడ్డి పాల్గొని ఆహార పరిశ్రమలో పరిశోధన, సాంకేతికత పరివర్తనాత్మక పాత్రపై విద్యార్థులకు వివరించారు. సాంకేతికత ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు ఫుడ్ సైన్స్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్స్, మౌలిక ప్రదర్శనలతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొనగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాబార్డ్ పరిశ్రమ నిపుణులు పాండురంగ, సీఎస్ఐఆర్ ప్రతినిధి జ్యోతిర్మయి, చందనశ్రీ, సురేశ్ తదితరులు పలు ప్రదర్శనలతో పరిశ్రమ అంచనాలపై వివరించారు. సదస్సులో వీరశెట్టి పాటిల్, రాథోడ్, సయ్యద్ అబ్దుల్, గణపతిరాజు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.